# ఆదిలాబాద్ వార్త



మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

సోమవారం 29, సెప్టెంబర్ 2025


# వర్షాలతో అయోమయంలో రైతులు



✶ పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం

✶ అధిక వర్షాలకు తోడు యూరియా కొరతతో కుదేలైనా రైతన్న

✶ వర్షాకాలం ముగుస్తున్న తగ్గని వర్షాలు

బోథ్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త

ఖరీఫ్ సీజన్ ముగియవస్తున్న గత రెండు నెలలుగా ఏకధాటిగా కురుస్తున్న భారీ వర్షాలతో పంటలు దెబ్బతింటున్నాయి. దీంతో రైతులకు కంటిమీద కునుకు లేకుండా పోతున్నది. భారీ వర్షాల కారణంగా పత్తి, సోయ పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. పత్తి ప్రస్తుతం పూత, కాయ దశ నుంచి పత్తి సేకరణ దశలో ఉండేది. ఇక సోయా పంట విషయానికొస్తే రబి పంట దేవుడేరుగు వేసిన పంట చేతికొస్తే చాలు అనే విధంగా ఉంది. వరుసగా వర్షాలు కురుస్తుండడంతో చేలలో వాన నీరు నిలుస్తుండడంతో మొక్కలు ఎర్రబారి తెగుళ్ల సోకుతున్నాయి. దీంతో దిగుబడి తగ్గడమే కాకుండా కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా చేతికొచ్చే పరిస్థితి కనిపించడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. అతివృష్టి, అనావృష్టికి తోడు తెగుళ్ల అధికమై పంటలు పాడైపోతున్నాయి. ఎర్రబడుతున్న పత్తి పంటను చూసి రైతులు కన్నీళ్ల పెట్టుకుంటున్నారు. గతేడాది పత్తి పంటలు దెబ్బతినడంతో ఈసారి మంచి దిగబడి ధర వస్తుందని ఆశించిన రైతులు అధిక మొత్తంలో పంటలను సాగు చేశారు. అయితే ఆగస్టు, సెప్టెంబర్ నెలలలో కురిసిన అధిక వర్షాలు రైతులను నిండా ముంచాయి. ఇదివరకు వర్షాలు కురవకపోతే రైతులు పండగలు, కప్పతల్లి పూజలు చేసేవారు ఇప్పుడున్న పరిస్థితుల్లో ఏ పూజలు చేస్తే వర్షాలు తగ్గుముఖం పడతాయో అర్థం కానీ పరిస్థితుల్లో ఉన్నారు. భారీ వర్షాల కారణంగా రైతులు తమ చేలల్లో కలుపు తీయించలేని పరిస్థితులు నెలకొన్నాయి దీంతో గడ్డి మందులు వాడడం వల్ల పత్తి పువ్వు అధికంగా రాలిపోవడమే కాకుండా వర్షపు నీటిలో మునగడం వల్ల ఉన్న కాస్త పత్తి కాయలు కుళ్ళిపోవడం జరుగుతున్నాయి. ఇక సోయా పంట వరుసగా కురుస్తున్న వానలతో మొక్కలపైనే నల్లబారడం, మొలకలు రావడం మిగతా 2లో..



# పేదలకు వరం.. సీఎం రిలీఫ్ ఫండ్



* ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్

కాగజ్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ పట్టణంలోని ఎమ్మెల్సీ దండే విఠల్ నివాసంలో బెజ్జూర్ మండలంలోని తలాయి గ్రామానికి చెందిన పనేం బీమయ్య సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ అనారోగ్యాల బారినపడి నిరుపేదలు ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన వారికి ప్రభుత్వం సిఎంఆర్ఎఫ్ కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పిస్తుందని అన్నారు. సీఎం సహాయనిధి పథకం వల్ల పేద ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఆపద సమయంలో సంజీవినీలా పని చేస్తోందని పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


# వైభవంగా అడెల్లి పోచమ్మ జాతర

* యువకుల కేరింతలు, శివసత్తులు నృత్యాలు * పోలీసుల రక్షణలో ఆభరణాలు

దిలావర్పూర్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త

దిలావర్పూర్ మండల కేంద్రంలో ఆదివారం అడెల్లి పోచమ్మ గంగ నీళ్ల జాతర ఘనంగా నిర్వహించారు. మండలంలోని సాంగ్వి గ్రామ గోదావరి నదికి కాలినడకన వెళ్లి అమ్మవారి ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి వాటికి అభిషేకం చేశారు. అనంతరం మిగతా 2లో..





# రిజర్వేషన్లపై డైలామాలో నేతలు

✪ అంచనాలు తలకిందులు ✪ మొదటి శ్రేణి నాయకులు ఉక్కిరి బిక్కిరి.. ✪ రాజకీయ భవితవ్యం తలకిందులు

బెల్లంపల్లి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త

సర్పంచు, ఎంపీటీసీ, జడ్పిటీసీ స్థానాల్లో ప్రకటించిన రిజర్వేషన్లపై రాజకీయ నాయకులు మల్ల గుల్లాలు పడుతున్నారు. తాము ఈసారి ఎంపీపీ లేదా జడ్పిటిసి స్థానాల్లో పోటీచేసి గెలిచి తీరుతామని నిన్నటి వరకు రంకెలు వేసిన నాయకులకు ఈ రిజర్వేషన్లు పొసగడం లేదనే చర్చ సాగుతోంది. గెలవడమే కాదుచివరి అంకంలో జడ్పీ చైర్మన్ పదవులు మిగతా 2లో..

# ఇక్కడ రెండు వర్గాలు లేవు.. ఉన్నది ఒకటే వర్గం కేసీఆర్ వర్గం

- మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప
- కోనేరు కోనప్పకు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ఘనస్వాగతం
- బీఆర్ఎస్ పార్టీలో కోనేరు కోనప్ప రాకతో కార్యకర్తల్లో జోష్







కాగజ్‌నగర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త

కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లో మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు బీఆర్ఎస్ పార్టీలో తిరిగి చేరిన సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం లభించింది. అనంతరం రైల్వే స్టేషన్ నుంచి ద్విచక్ర వాహనం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ ప్రధాన వీధుల గుండా వినయ్ గార్డెన్ వరకు సాగింది. అనంతరం వినయ్ గార్డెన్ లో ఏర్పాటుచేసిన కార్యకర్త సమాసం మాజీ ఎమ్మెల్యే కోనప్ప మాట్లాడుతూ బిఆర్ఎస్ లో ఎలాంటి వర్గాలు లేవని, ఉన్నది ఒక్కటే కెసిఆర్ వర్గం అని స్పష్టం చేశారు. గతంలో బిఆర్ఎస్ హాయంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించి, స్థానిక సంస్థల ఎన్నికల్లో ఐక్యంగా పోరాడి అన్ని స్థానాలను టిఆర్ఎస్ అభ్యర్థిలు గెలిచే విధంగా తమ వంతు కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆసిఫాబాద్ జిల్లా జడ్పీ చైర్మన్ ను టిఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు బహుమతిగా ఇస్తామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి అన్నారు. ఈ సమావేశంలో మాజీ బీఆర్ఎస్ పార్టీ జడ్పిటీసీలు, ఎంపిటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్‌లు, కోనేరు అభిమానులు సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



## పాలకులారా..! ఇంకెన్నాళ్లు ఈ కష్టాలు మాకు

### కళ్ళముందే వాగు అడ్డంకితో ప్రాణాలు పోతుంటే సహించలేకపోతున్నాం

కెరమెరి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త

పాలకులారా ఇంకెన్నాలు ఈ కష్టాలు ప్రాణాలు గాలిలోకలుస్తుంటే చూస్తూ ఉంటారా ఇప్పటికైనా మారండి వాగుపై వంతెన నిర్మించి మా కష్టాలు తీర్చండి అని 8 గ్రామాల ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని అనార్‌పల్లి వాగు అవతలి వైపు ఉన్న 8 గ్రామాల ప్రజల కష్టాలను చూడండి. వాగుపై వంతెన లేక అత్యవసర సమయంలో వైద్య కోసం వాగు ప్రవాహం అడ్డు రావడంతో వారి ప్రాణాలు పిట్టల్లా రాలిపోతుంటే మీ మనసు చలించడం లేదా? వారం రోజుల వ్యవధిలోనే ఇద్దరు వృద్ధుల మృతి సంఘటన చూసి గుండె తరుక్కుపోతోంది. దశాబ్దాల కాలం నాటి వాగు కష్టాలను చూసి బరువెక్కిన గుండెతో గ్రామస్తుల ఆవేదనలు బాహ్య ప్రపంచానికి వివరించిన జాతీయ మానవ హక్కుల కమిటీ జిల్లా చైర్మన్ రాథోడ్ రమేష్. వారిని ఓటర్లు గానే చూడకండి. మానవతా దృక్పథంతో స్పందించి పెండింగ్ లో ఉన్న అనార్పల్లి వాగు పై వంతెన నిర్మాణ పనులు మొదలయ్యేలా చర్యలు తీసుకోండి. ఈ సంవత్సరంలోనైనా పనులు మొదలయ్యేలా చూడండి.




## జంతువులకి తప్పనిసరిగా టీకాలు వేయించాలి

ఆసిఫాబాద్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త

జంతువులకి తప్పనిసరిగ టీకాలు వేయించాలని జిల్లా పశు వైద్య అధికారి సురేష్ పేర్కొన్నారు. ప్రపంచ రేబిస్ దినోత్సవం సందర్భంగా ఆదివారం ఆసిఫాబాద్ లోని ప్రాంతీయ పశువైద్యశాల వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పెంపుడు జంతువులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా జిల్లా అధికారి మాట్లాడుతూ ఇళ్లలో పెంచుకొనే పెంపుడు కుక్కలు, పిల్లులకు ఉచ్చితంగా రాబిస్ వ్యాధి నివారణ టీకాలు వెయ్యాలన్నారు. ఈ వ్యాధి ప్రాణాంతకమని, పెంపుడు జంతువులకి తప్పనిసరిగ టీకాలు వేపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ మురళీకృష్ణ, సిబ్బంది సుప్రియ, ప్రశాంత్, వినోద్, డాగ్ స్క్వాడ్ సిబ్బంధి, పెంపుడు జంతువుల యజమనులు పాల్గొన్నారు.

## పదవి విరమణ పొందిన ఉద్యోగికి ఘన సన్మానం

బోథ్, సెప్టెంబర్ 27, ప్రభాతవార్త

మావల ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న ఆకుల భూమయ్య ఉద్యోగ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి ఆదివారం బోథ్ బిఆర్ఎస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ పొందిన భూమయ్యను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు బండారి శ్రీధర్ రెడ్డి, సర్పంచు సురేందర్, బొడ్డు శ్రీనివాస్, అల్ల కొండ ప్రశాంత్, రూప్‌చంద్ లు పాల్గొన్నారు.





## అడెల్లి అమ్మవారికి చేనేత పట్టు చీర సమర్పించిన పద్మశాలీలు

సారంగాపూర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త

మండలంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం అడెల్లి మహా పోచమ్మ అమ్మవారికి ఆదివారం గంగనీళ్ల జాతర సందర్భంగా పద్మశాలి వంశస్థులు పట్టు చీరను సమర్పించారు. ఉదయం ఆరు గంటలకు అమ్మవారికి పుట్టింటి సారెగా చేనేత పట్టు వస్త్రాన్ని సమర్పించగా ఆలయ పూజారి శ్రీనివాస్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ఆరాధిస్తూ అందరికీ సుఖసంతోషాలు కలగాలని భక్తులు ప్రార్థించారు. అనంతరం పద్మశాలి సంఘ సభ్యులు మాట్లాడుతూ అడెల్లి శ్రీ మహా పోచమ్మను పద్మశాలీల ఆడబిడ్డగా భావించి ప్రతి ఏటా ఆనవాయితీగా చేనేత పట్టు వస్త్రాలను సమర్పిస్తున్నామని తెలిపారు. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లే, తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారికంగా జాతర సందర్భంగా మొదటగా అమ్మవారికి పద్మశాలి వంశస్థులు చేనేత వస్త్రాలను సమర్పించేలా జిఓను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ప్రతి హిందువు హిందువుగా జీవించాలి

**- జిల్లా ప్రచారక్ నాగరాజ్**

కౌటాల, సెప్టెంబర్ 28 ప్రభాతవార్త

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా కౌటాలలో విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దుర్గం జుంగాజీ మాట్లాడుతూ హిందూ ధర్మంలో ఉన్న ధర్మ, అర్థ, కామ, మోక్ష అనే చతుర్విధ పురుషార్థాలను ఆచరించాలని పిలుపునిచ్చారు. ప్రధాన వక్తగా హాజరైన జిల్లా ప్రచారక్ నాగరాజ్ మాట్లాడుతూ విజయదశమి మన విజయానికి సంకేతమని, శక్తి స్వరూపిణి దుర్గామాత మహిషాసురుని సంహరించిన రోజే విజయదశమి అని తెలిపారు. అదేవిధంగా శ్రీరాముడు రావణాసురుని సంహరించిన రోజు కూడా విజయదశమి రోజే అని, అంతేకాక 1925లో నాగపూర్‌లో ఆర్ఎస్ఎస్ స్థాపన జరిగింది విజయదశమి రోజునేనని గుర్తుచేశారు. ఆర్ఎస్ఎస్ శతాబ్దోత్సవ సందర్భంలో హిందూ సమాజంలో మార్పు కోసం పంచ పరివర్తననే లక్ష్యంగా సంఘ్ కృషి చేస్తోందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కౌటాల ఖండ కార్యవాహ ప్రబీర్ మండల్, చిప్ప మల్లయ్య, ఉప్పుల వెంకటేష్‌తో పాటు అనేక మంది స్వయంసేవకులు పాల్గొన్నారు.

## గోదావరి వరద నీటిమట్టాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి

**- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

నస్పూర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త



జిల్లాలో కురుస్తున్న వర్షాలు, ఎగువ ప్రాంతాల నుండి చేరుతున్న వరదనీటి కారణంగా గోదావరి నది తీరంలో నీటిమట్టం పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల గోదావరి నది తీరంలో వరదనీటి పరిస్థితిని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వరద పరిస్థితులపై అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాలతో కడెం, ఎస్.ఆర్.ఎస్.పి ప్రాజెక్టుల నుండి వరద నీటిని దిగువ ప్రాంతాలకు విడుదల చేసినందున శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుండి వరద నీటిని విడుదల చేయడం జరిగిందని, ఈ నేపథ్యంలో గోదావరి నదిలో చేరుతున్న వరదనీటి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజా రక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. గోదావరి నది వద్ద మున్సిపల్, పోలీస్ శాఖల సమన్వయంతో బందోబస్తు ఏర్పాటు చేయాలని, ఎవరు నదీ తీరానికి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని, భారీకేడ్లు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దుర్గామాత వద్ద బోనాల పండుగ

సిరికొండ, 28 సెప్టెంబర్, ప్రభాతవార్త

సిరికొండ మండల కేంద్రంలో ఘనంగా జరుగుతున్న దుర్గా దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారికి మహిళ భక్తులు భక్తి శ్రద్ధలతో బోనాలను సమ ర్పించారు. మండల కేంద్రంలోని పుర వీధుల గుండా డప్పు చప్పుల మధ్యన ఊరేగింపుగా వెళ్లి మహిళలు దుర్గా దేవికి బోనాలను సమర్పించారు. ఈ సందర్భంగా మహిళలు భోజన నైవేద్యాలతో మొక్కులు చెల్లించిన అనంతరం తమ కుటుంబాన్ని సుఖశాంతులతో కాపాడాలని, తమకు ఏ ఆపద రాకుండా చూడాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పాల్గొన్నారు.



# రిజర్వేషన్లతో ఆదివాసులకు అన్యాయం జరుగుతుంది

**కెరమెరి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

జిల్లాకు కొమరం భీమ్ అని పేరు పెట్టుకుని ఏజెన్సీ మండలమైన కెరమెరి మండలానికి గిరిజనేతలను నాయకులుగా రిజర్వేషన్ కల్పించడం సమంజసం కాదని ఆదివాసి గిరిజన నాయకులు అన్నారు. మండల కేంద్రంలోని ఆదివాసి భవన్లో ఆదివారం అత్యవసర ఆదివాసి సంఘాల నాయకుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వము శనివారం ప్రకటించి స్థానిక ఎన్నికల రిజర్వేషన్‌లలో ఆదివాసీలకు అన్యాయం జరిగింది. ఏజెన్సీ ప్రాంతం అయిన కెరమెరి మండలములో జెడ్పీటీసీ, ఎంపిపి, ఎంపీటీసీ స్థానలా రిజర్వేషన్‌లను మార్చడం ఆదివాసి హక్కులను చట్టాలను అగౌరవ పరిచారు. ఏజెన్సీ ప్రాంతంలో రిజర్వేషన్‌లను కూడా దోపిడీ చేసుకొని ఏజన్సీను సర్వనాశనం చేసేలా కుట్రలు పన్నుతున్నారు. జిల్లాకు కుమ్రం భీం పేరు పెట్టి కుమ్రం భీమును అవమానం చేసేలా రిజర్వేషన్‌ను ఎస్టీ కాకుండా వేరే రిజర్వేషన్ చేయడం అనేది ఆదివాసి ప్రజలకు చాల అన్యాయం జరిగింది కాబట్టి కుమ్రం భీం జిల్లాకు జెడ్పి చైర్మెన్ మరియు ఏజెన్సీ మండాలం అయిన కెరమెరి జెడ్పీటీసీ ఎంపిపి ఎంపిటిసీ



స్థానాలను ఎస్టీ రిజర్వేషన్ కల్పించకుంటే స్థానిక ఎన్నికలను మండాలంలో బహిష్కరిస్తం అని తీర్మానించారు. సోమవారం జిల్లా కలెక్టర్ వినతి పత్రాన్ని అందించి, సమస్య నూ వివరించి అనంతరం భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేస్తామని మండలములోని జాతి పెద్దలు, అదివాసి సంఘాల నాయకులు అన్ని పార్టీల ఆదివాసి నాయకులు, పేసా కొఆర్డినేటర్లు ఆదివాసీ నాయకులు అందరు తీర్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆదివాసి పెద్దలూ కోవ దేవ్ రావు, సీడాం జగన్నాథ్ రావు, తుడుందేబ్బ జిల్లా అధ్యక్షులు కోవ విజయ్ కుమార్, తుడుందేబ్బ జిల్లా గౌరవ అధ్యక్షులు (సలహదారు) కనక ప్రభాకర్, రాజ్ గొండ్ సేవ సమితి జిల్లా గౌరవ అధ్యక్షులు మడవి రఘునాథ్, విద్యార్థి సంఘం జిల్లా నాయకుడు మడవి భరత్ భూషణ్, రాజ్ గొండ్ సేవ సమితి జిల్లా కార్యనిర్వహక అధ్యక్షులు ఆత్రం చందన్నా, రాజ్ గొండ్ సేవ సమితి మండల అధ్యక్షులు మాజి ఎంపిపి పెందోర్ మోతిరాం, మాజీ జడ్పీటిసి సెడ్మకి ధృపత బాయి, విద్యార్థీ సంఘం మండల అధ్యక్షులు సెడ్మాకీ తుకారాం, కాంగ్రెస్, బిఆర్ఎస్, బిజెపి, బియస్పి, వివిధ పార్టీల మండలల నాయకులు జిల్లా నాయకులు, మరియు ఆదివాసి జాతి పెద్దలు సంఘాల నాయకులు యువజన సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## శాంతి భద్రతల పరిరక్షణకే కార్డెన్ సెర్చ్

### - కాగజ్‌నగర్ రూరల్ సిఐ కుమారస్వామి

**కాగజ్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

శాంతిభద్రతలను పరిరక్షించేందుకే గ్రామాల్లో కార్డెన్ సర్చ్ నిర్వహింస్తున్నామని కాగజ్‌నగర్ రూరల్ సిఐ కుమారస్వామి అన్నారు. ఆదివారం కాగజ్‌నగర్ మండలం ఈస్గాం పోలీస్ స్టేషన్ పరిధిలోని నెంబర్ 5లో కార్డన్ సెర్చ్ నిర్వహించి ప్రజలకు నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎవరైనా అపరిత వ్యక్తులు అనుమానాస్పదంగా తిరుగుతుంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వాలని అన్నారు. అనంతరం సరైన పత్రాలు లేని 50 బైకులు, 5 ఆటోలను సీజ్ చేసినట్లు తెలిపారు. సైబర్ క్రైం, గంజాయి నియంత్రణ, సీసీ కెమెరాల ప్రాముఖ్యత, ట్రాఫిక్ రూల్స్, కొత్తచట్టాలపై అవగాహన, మూఢ నమ్మకాల గురించి అదే విధంగా దసరా పండుగ సందర్భంగా భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఈస్గాం ఎస్ఐ కళ్యాణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా అమ్మవారికి బోనాలు

**సోన్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**



మండలంలోని న్యూ వెల్మల్ గ్రామంలో ఆదివారం రోజున గాయత్రి అమ్మ సేవా సమితి ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల సందర్భంగా అమ్మవారికి బోనాలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. కులాలకు అతీతంగా తండోప తండాలుగా వచ్చి బోనాల పండుగని ఘనంగా జరుపుకున్నారు. పంటలు బాగా పండాలని అమ్మవారి దాయ అందరిపై ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.

## దుగినెపల్లి గ్రామపంచాయతీని బీసీలకు రిజర్వు చేయడం సరికాదు

### ఎస్సిలకు కేటాయించేలా చూడాలని ఎమ్మెల్యేకు స్థానికుల వినతి

**బెల్లంపల్లి, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త:**

బెల్లంపల్లి మండలంలోని దుగినపల్లి గ్రామపంచాయతీని ఎన్నికల అధికారులు బీసీ మహిళకు రిజర్వ్ చేయడాన్ని రద్దు చేసేలా తగు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యేను కోరారు. ఆదివారం బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్‌ను స్థానిక క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు జుమ్మిడి బాణయ్య మాట్లాడారు. గ్రామ పంచాయతీలో మొత్తం 493 మంది ఓటర్లు ఉన్నారని విరిలో 99.8 శాతం మంది ఎస్సి ఓటర్లు ఉండగా ఈ గ్రామ పంచాయతీని ఎన్నికల అధికారులు ఇద్దరు కేవలం ఇద్దరే బీసీ మహిళ ఓటర్లు ఉన్నారని ఎమ్మెల్యేకు వినతి పత్రం ద్వారా వివరించినట్లు తెలిపారు. ఒక్క శాతం కుడా జనాభా లేనప్పుడు అధికారులు బీసి మహిళకు ఎలా రిజర్వ్ చేశారని ఆయన ప్రశ్నించారు. ఈ విషయం పై జిల్లా కలెక్టర్ తగు న్యాయం చేసేలా ఎమ్మెల్యే కృషి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ నాయకులు కాసిపాక రాజం, ఎస్. శ్రీనివాస్, ఎస్. కృష్ణ, ఆర్. పోశం తదితరులు పాల్గొన్నారు.



## కాగజ్‌నగర్ మండల మాలీ సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక

**కాగజ్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

కాగజ్‌నగర్ మండలం చింతగూడ కోయవాగు గ్రామంలో మాలీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు లెండుగురె శ్యామ్‌రావు నివాసంలో ఆదివారం కాగజ్‌నగర్ మండల మాలీ సంక్షేమ సంఘం నూతన కమిటిని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా మోర్లే విజయ్(బారెగూడ), ఉపాధ్యాక్షులుగా ఆదే శ్రీనివాస్ (కోయవాగు చింతగూడ), ప్రధాన కార్యదర్శిగా వశాకే హనుమంతు (కోసిని)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్రం అధ్యక్షుడు లెండుగురె శ్యామ్‌రావు తెలిపారు. అదే విధంగా జాయింట్ సెక్రటరిగా మోర్లే మల్లేష్ (రాస్పల్లి), కోశాధికారిగా వాడే రాజు (కోసిని) కార్యవర్గ సభ్యులుగా సెండే రాజశేఖర్, మందాడే రామయ్య, వాడై నరసింహ, గుర్లే అంజయ్య, సెండే శ్రీహరిలను ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం నూతనంగా ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యాక్ష, ప్రధాన కార్యదర్శులను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాక్షులు గౌత్రే గోపాల్, జిల్లా నాయకులు లెండుగురె గోపి, మాలీ సంఘం నాయకులు లెండుగురె శంకర్, చారిగాం తాజామాజీ ఎంపిటిసి మొర్లే తిరుపతి, ఆయా గ్రామాల మాలీ కులస్థులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ స్ఫూర్తితో హక్కుల సాధనకై పోరాడాలి

**ఆసిఫాబాద్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

భగత్ సింగ్ స్ఫూర్తితో యువత హక్కుల సాధన కోసం పోరాడాలని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు గెడం టీకానంద్, గొడిసెల కార్తీక్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని డివైఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన భగత్ సింగ్ 118వ జయంతి కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వలసవాద పాలనకు వ్యతిరేకంగా భారత దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం రావాలని 23 ఏళ్ల చిరుప్రాయంలోనే తన ప్రాణాలను తృణ ప్రాయంగా అర్పించిన విప్లవకారుడు కామ్రేడ్ షహీద్ భగత్ సింగ్ అని కొనియాడారు. స్వాతంత్ర్యానంతరం భావితరాలకు అన్ని హక్కులు, సౌకర్యాలు లభించాలని ఆశించిన వ్యక్తి అని గుర్తు చేశారు. అందరికీ విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కోసం రాబోయే రోజుల్లో భగత్ సింగ్ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్, డివైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి దుర్గం రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

**నస్పూర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

మంచిర్యాల నగర పాలక సంస్థ పరిధిలోని శ్రీరాంపూర్ సాందీపని ఉన్నత పాఠశాల 2000-2001 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నస్పూర్‌లోని బొమ్మరిల్లు ఫంక్షన్ హాల్‌లో జరుపుకున్నారు. ఆదివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆద్యంతం ఆహ్లాదకరంగా సాగింది. ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ మల్లెత్తుల రాజేంద్రపాణి ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. ఈ ఆత్మీయ సమ్మేళనానికి విచ్చేసిన స్నేహితులందరూ 25 సంవత్సరాలకు ముందు పదో తరగతిలో విద్యను అభ్యసించిన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ, తమ క్షేమ సమాచారాలు పంచుకుంటూ, ఎంతో సరదాగా ఆటపాటలతో గడిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్, ఉపాధ్యాయులు శ్రీనివాస్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మల్లిక్, ముష్క మల్లేష్, పూర్వ విద్యార్థులు కే. తిరుపతి, కే. సురేష్, ఏ. మధుకర్, ఈ. రమేష్, సిద్దన సాగర్, అల్లాడి సురేష్, సుమలత, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన జాతర

**సారంగాపూర్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

మండల కేంద్రంలోని గంగనీళ్ల జాతర ఆదివారం రాత్రి 9 గంటలకు ముగుస్తుంది. ఈ రోజు ఉదయం పోచమ్మను గోదావరి నది జలాలలో అభిషేకం చేసుకొని, సన్నాపు వలగొడుగు వేసి దాని క్రింద నుండి అమ్మవారు, భక్తులు వేళ్ళు తారు ఈవిధంగా వెళ్లడం ద్వారా అమ్మ కరుణ, కటాక్షలు లభిస్తాయి అనే నమ్మకం గలదు. ఈవిధంగా మార్గమధ్యంలో వేలాదిమంది భక్తులు చేస్తారు, అమ్మవారి ని వివిధ గ్రామాల గుండ పోలీస్ బందోబస్తుమధ్య, ప్రజల, భక్తులు సహాయ సహకారాలతో దారి పొడవునా నీరాజనాలు తెలుపుతూ అమ్మవారికి స్వాగతం వీడ్కోలు, తెలుపుతూ మందిరానికి చేరుకుంటుంది అక్కడ కోనేరు నీరుతో గంగా జలాన్ని కలిపి అమ్మవారికి అభిషేకం చేసి, నగల అలంకరణ చేస్తారు అనంతరం పూజాచేయడం జరుగుతుంది. తరువాత భక్తులు అమ్మవారిని సందర్శించుకుంటారు దీనితో జాతర ముగిసినది అని ఆలయ చైర్మన్ భోజగౌడ్, ఆలయ కార్య నిర్వహణ అధికారి తెలిపారు. అనంతరం పోలీస్ యంత్రాంగానికి జాతరను దిగ్విజయం చేసినందుకు అభినందనలు తెలిపినారు.

## యూరియా పంపిణీ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే

**పెంచికల్ పేట్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

ఆదివారం పెంచికల్ పేట్ మండలంలోని ఛేడ్వాయి క్లస్టర్ రైతు వేదికలో ఆదివారం వ్యవసాయశాఖ అధికారులు 444 బస్తాల యూరియాను పంపిణి చేశారు. ఈ సందర్భంగా పంపిణి కేంద్రాన్ని ఎమ్మెల్యే హరీష్ బాబు తనిఖీ చేసి పంపిణి సరళిని పరిశీలించారు. ఈ సంధర్భంగా అయన మాట్లాడుతూ త్వరలో మరిన్ని యూరియా లోడ్లు రానున్నాయని రైతులు ఆందోళన చెందకూడదని తెలిపారు. రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద ముందుగా టోకెన్లు తీసుకోని ఉండాలని తెలిపారు.

## పెంపుడు కుక్కలకు టీకాలు వేయడం తప్పనిసరి

**కాగజ్‌నగర్ రూరల్, సెప్టెంబర్ 28, ప్రభాతవార్త**

పెంపుడు కుక్కలకు టీకాలు వేయడం తప్పనిసరి అని, టీకాలు వేయించకోవడం ద్వారా రేబీస్‌ను నిర్మూలించడం సాధ్యమవుతుందని ప్రాథమిక పశువైద్య కేంద్రం పశువైద్యాధికారిని డాక్టర్ మరిమళ అన్నారు. ప్రపంచ రేబీస్ దినోత్సవం సందర్భంగా రేబీస్ రహిత భారత్ లక్ష్యంతో ఆదివారం ప్రాథమిక పశువైద్య కేంద్రం, కాగజ్‌నగర్‌లో ఉచిత రేబీస్ వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెంపుడు కుక్కల యజమానులు ఉత్సాహంగా పాల్గొని సుమారు 80 కుక్కలకు ఉచిత టీకాలు వేయించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కరచిన తర్వాత, కచే ముందు వ్యాక్సినేషన్ల ప్రాముఖ్యత, వ్యాధి వ్యాప్తి చికిత్స లేకపోవడంతో నివారణే మేలైన మార్గమని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ శిబిరంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు డా. అడ్లూరి పరిమళ, డా. విజయ్ సిబ్బంది, సహాయక సిబ్బంది ఎల్.ఎస్.ఏ శైలేందర్, వి.ఏ. అమన్, ఓ.ఎస్. షహీదాఖటూన్, గోపాలమిత్రలు దేటి రమేష్, వంశీ, తదితరులు పాల్గొన్నారు.